క్లుప్తంగా

శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ


భూమి పూజలో పాల్గొన్న గ్రామస్తులు

మోమిన్‌పేట: మండల పరిధిలోని మేకవనంపల్లి గ్రామంలో శివాజీ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు గ్రామ పెద్దల సమక్షంలో ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలు, చూపిన ధైర్య సాహసాలను పలువురు గుర్తు చేసుకున్నారు.

బస్టాండ్.. నిలబడేందుకు పరేషాన్


మేకవనంపల్లి బస్టాండ్ వద్ద ఉంచిన ఇటుకలు

మోమిన్‌పేట: ప్రయాణికులకు నిలువ నీడను ఇవ్వాల్సిన బస్టాండ్ నిరుపయోగంగా మారింది. అందులో గృహ నిర్మాణ సామగ్రిని వేసి పూర్తిగా ఆక్రమించారు. దీంతో బస్టాండ్‌లో ప్రయాణికులకు నిలబడేందుకు చోటు లేకపోవడంతో చెట్లనే ఆశ్రయిస్తున్నారు. మండల పరిధిలోని మేకవనంపల్లిలో నిర్మించిన బస్టాండు పరిస్థితి ఇది. ప్రయాణికులు ఉండేందుకు వీలు కాకుండా ఇతర పరికరాలు ఉంచారు. దీంతో ప్రయాణికులు చెట్ల కిందనే నిలబడుతున్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షించి ప్రయాణికులకు అందుబాటులో బస్టాండు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న వాలీబాల్ శిక్షణ


శిక్షణలో క్రీడాకారులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తిలో వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వాలీబాల్ శిక్షణ కొనసాగుతుంది. వారం రోజుల నుంచి కొన సాగుతున్న శిక్షణలో యువకులు, చిన్నారులు పాల్గొంటున్నారు. వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు తమ సొంత డబ్బులతో ఆసక్తిగల క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణలో గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల యువకులు, చిన్నారులు పాల్గొంటున్నారు.

అయోధ్యకు భజన మండలి భక్తులు


యాత్రకు బయలుదేరిన భక్తులు

కొడంగల్: పట్టణంలోని మహదేవుని ఆలయం భజన మండలి భక్తులు ఆదివారం ఉదయం అయోధ్య నగరానికి బయలుదేరారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యకు వెళ్లి బాలరాముని దర్శించుకోడానికి పట్టణానికి చెందిన 17 మంది భక్తులు సిద్ధమయ్యారు. అయోధ్యలో బాల రాముని విగ్రహం ప్రతిష్ఠించిన తర్వాత యాత్రకు వెళ్లాలని పలువురు భక్తులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో మహదేవుని ఆలయం భజన మండలి భక్తులు అయోధ్యతో పాటు కాశీ, ప్రయాగరాజ్, త్రివేణి సంగమం తదితర పుణ్యక్షేత్రాలు సందర్శించడానికి వెళ్లారు.

రమేష్ కుమార్‌ను సన్మానించిన నాయకులు


రమేష్ కుమార్‌కు శాలువ కప్పుతున్న నేతలు

తాండూరు టౌన్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్‌ను భద్రాద్రికొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ బీజేపీ నాయకులు ఆదివారం సన్మానించారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఇన్‌చార్జిగా ఆయన పినపాకకు వెళ్లారు. అక్కడ అందరిని కలుపుకొని ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి గెలుపు కోసం పది రోజుల పాటు పర్యటించారు. ఈ సందర్భంగా పినపాక నాయకులు శ్రీనివాస్, సీతారామ రాజు, భిక్షపతిలు మాట్లాడుతూ తక్కువ సమయంలో నియోజకవర్గ నాయకులను సమన్వయ పరిచారన్నారు. రమేష్ మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో పూర్తి చేశానన్నారు.

బీఎస్ఎన్ఎల్.. సేవలు నిల్

- మూతపడిన టెలిఫోన్ ఎక్స్ఛేంజ్
- పోటీ తట్టుకోలేక చతికిల పడ్డ సంస్థ
- అంతంతమాత్రంగానే ఇంటర్నెట్ కనెక్షన్లు


ఎన్నారంలో మూతపడిన టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ భవనం


బంట్వారంలో మూతపడిన బీఎస్ఎన్ఎల్ కార్యాలయం

బంట్వారం: భారత్ సంచార్ నిఘం లిమిటెడ్(బీఎస్ఎన్ఎల్) అందించే సేవలు నానాటికి కనుమరుగవుతున్నాయి. ఒకప్పుడు ప్రతి గ్రామంలో బీఎస్ఎన్ఎల్ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేవి. మొదట్లో ఏరియా పరిధిలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌ల నుంచి రోడ్డు పొడువునా స్తంభాలు నాటి ఊరూరికి ల్యాండ్ ఫోన్ సౌకర్యం ఉండేది. తర్వాత కేబుల్ ద్వారా టెలిఫోన్ వ్యవస్థను నడిపించారు. రానురాను ల్యాండ్ ఫోన్లు లేకుండా పోయాయి. సెల్‌ఫోన్లు మార్కెట్‌లోకి రావడంతో ఒకప్పుడు బాగా నడిచిన ఎస్టీడీ, ఐఎస్డీ టెలిఫోన్ బూతులు అప్పట్లోనే కనుమరుగయ్యాయి. తదనంతరం వచ్చిన కాయిన్ బాక్స్‌లు కొన్నాళ్లకే మాయమయ్యాయి. ల్యాండ్ ఫోన్లు సైతం గ్రామాల్లో ఒక్కటి కనిపించడం లేదు. 30 ఏళ్ల కిందట పరుగులు పెట్టిన బీఎస్ఎన్ఎల్ సేవలు ఇప్పుడు పూర్తిగా డీలా పడ్డాయి. ఉమ్మడి బంట్వారం మండలంలో మండల కేంద్రం బంట్వారంతో పాటు ఎన్నారం గ్రామంలో 25 సంవత్సరాల కిందటనే టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లను ఏర్పాటు చేశారు. అప్పట్లో వీటికి పక్కా భవనాలు కూడా నిర్మించారు. బీఎస్ఎన్ఎల్ సేవలు నిలిచి పోవడంతో బంట్వారం, ఎన్నారంలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ భవనాలు కొన్నేళ్ల నుంచి వృథాగానే పడి ఉన్నాయి. అప్పట్లో వీటి పరిధిలోని మారుమూల గ్రామాల్లో సైతం ల్యాండ్ ఫోన్ సౌకర్యం ఉండేది. మొదట్లో పోస్టాఫీసులో కచ్చితంగా గిర్రు గిర్రున తిప్పే టెలిఫోన్ ఉండేది. అత్యవసర సమయంలో ప్రజలు డబ్బులు చెల్లించి పోస్టాఫీసులో నుంచే ల్యాండ్ ఫోన్లకు మాట్లాడే వారు. మండల కేంద్రంలో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ల్యాండ్ ఫోన్లు ఉండేవి. ఇప్పుడు ఒక్కటీ కనిపించడం లేదు.

హవా అంతా సెల్‌ఫోన్లదే

సెల్‌ఫోన్లు మార్కెట్‌లోకి రావడంతోనే బీఎస్ఎన్ఎల్ సేవలు కాలక్రమేణ తగ్గుతూ వచ్చాయి. వివిధ ప్రైవేటు కంపెనీలు కొత్త కొత్త ఆఫర్లతో వినియోగదారులను ఆకర్షిస్తూ మార్కెట్‌లో దూసుకుపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ సంచార్ నిఘం లిమిటెడ్ పూర్తిగా చేతులెత్తేసింది. ప్రస్తుతం పట్టణాలకే పరిమితమైంది. అక్కడక్కడ కొనసాగే ఇంటర్నెట్ కనెక్షన్లతోనే కాలం వెళ్లదీస్తుంది. ఒకప్పుడు వెలిగిపోయిన బీఎస్ఎన్ఎల్‌కు ఇలాంటి దుర్గతి పట్టడం టెలిఫోన్ రంగంలోని ప్రైవేటు సంస్థ లేనని చెప్పకతప్పదు. నాటి టెలిఫోన్ డైరీలు, ల్యాండ్ ఫోన్లు నేడు ఎక్కడా ఒక్కటి లేదు. ప్రభుత్వ ఆఫీసుల్లో కూడా ప్రైవేటు ఇంటర్నెట్ కనెక్షన్లు పెట్టుకుని పనులు చేస్తున్నారు. ప్రజలు బీఎస్ఎన్ఎల్‌ను పూర్తిగా మర్చిపోయారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటికైనా సంబంధిత టెలికమ్యూనికేషన్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి బీఎస్ఎన్ఎల్‌కు మళ్లీ పూర్వ వైభవం తీసుకు రావాల్సిన అవసరం ఉంది.

ఖరీఫ్‌కు సన్నద్ధం

- ముందస్తు నైరుతితో రైతన్నల ఆశలు
- ఈసారి సైతం పత్తి సాగుకు మొగ్గు


మోమిన్‌పేటలోని ఎన్కేపల్లిలో ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న రైతులు

మోమిన్‌పేట: వాతావరణ శాఖ ముందస్తు నైరుతి పవనాలు రానున్నాయని తెలపడంతో ఖరీఫ్‌కు రైతన్నలు సిద్ధమవుతున్నారు. వేసవిలో ట్రాక్టర్ల ద్వారా దుక్కులు దున్నుకొని చదును చేసే పనిలో అన్నదాతలు నిమగ్నమయ్యారు. రోహిణి కార్తె ప్రారంభం కావడంతో విత్తనాలు విత్తుకొనేందుకు రైతులు పొలాలను సిద్ధం చేసుకొంటున్నారు. ఎక్కువ మంది వద్ద కాడెద్దులు లేకపోవడంతో ట్రాక్టర్ల ద్వారా చదును చేసుకొంటున్నారు. కాడెద్దులు కల్గిన రైతులు వాటితో భూములను చదును చేసే పనులలో మునిగిపోయారు. పల్లెల్లో సాగు కోసం సందడి వాతావరణం నెలకొంది.

80 శాతం మేర సాగు

గత సంవత్సరం మండల పరిధిలోని ఆయా గ్రామాలలో 80శాతం వరకు సాగు భూమిలో తెల్ల బంగారం(పత్తి) పంటను సాగు చేశారు. ప్రస్తుత ఖరీఫ్‌లో తెల్ల బంగారం సాగుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. తెల్ల బంగారం సాగు తప్ప ఇతర పంటలను సాగు చేస్తే ముఖ్యంగా జాతీయ పక్షి నెమలిలు, అడవి పందుల బెడదతో తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో రైతులు పత్తి సాగుకే మొగ్గు చూపుతున్నారు. ఎరువులు, పత్తి విత్తనాలు అవసరమైన మేరకు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

నకిలీ బెడద

పత్తి నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టేందుకు వ్యాపారస్తులు గ్రామాలలో తిరుగుతుంటారు. అలాంటి వారిని పట్టుకొని నకిలీల బెడద నుంచి రైతులను కాపాడాలని వారు కోరుతున్నారు. నకిలీ విత్తనాల వల్ల రైతులు నిండా మునుగుతారని తిరిగి కోలుకోలేని స్థితికి వెళ్తారని అంటున్నారు. కావునా వ్యవసాయాధికారులు, పోలీసులు తగు చర్యలు తీసుకొని మళ్లీ నకిలీల జోలికి వెళ్లకుండా వ్యాపారస్తుపై చర్యలు ఉండాలని రైతులు కోరుతున్నారు.


జినుగుర్తి తండాలో పేరుకుపోయిన వ్యర్థ జలాలు

మురుగు పారి.. దుర్గంధం వ్యాపించి

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి తండాలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. పలు ఇళ్ల నుంచి వచ్చిన మురుగంతా పాఠశాల ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో చేరింది. మురుగు పేరుకుపోయి దుర్వాసన వ్యాప్తిస్తోందని తండావాసులు వాపోతున్నారు. దోమలు స్వైర విహారం చేస్తున్నాయని చెబుతున్నారు. కావున పంచాయతీ పాలకవర్గం పట్టించుకోని మురుగును తొలగించాలని తండావాసులు కోరుతున్నారు.

ఒకరే ఎస్ఐ.. పనిభారం ఎక్కువై!

ధారూరు ఠాణాలో భర్తీ చేయని రెండో ఎస్ఐ పోస్టు



ధారూరు పోలీస్‌స్టేషన్

ధారూరు: శాంతిభద్రతల పరిరక్షణలో రక్షకభటులే కీలకం. పెరుగుతున్న జనాభాకు సరిపడా పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉంది. అందులో సిబ్బందిని సైతం అదే రీతిలో నియమించాలి. మండల పరిధిలోని ఠాణాలో ఒకే ఎస్ఐతో కాలం వెళ్లదీస్తున్నారు. దాదాపు 50 వేల జనాభా 32 గ్రామ పంచాయతీలు ఉన్న పెద్ద మండలం ధారూరు. ఇందులో 16 తండాలున్నాయి. ఈ మండలం నుంచి పోలీస్ స్టేషన్‌కు ప్రతిరోజు వివిధ కారణాలతో బాధితులు వస్తుంటారు. ఒకే ఎస్ఐ ఉండటంతో పనిభారం పెరిగి కేసుల విచారణ త్వరగా తేలేది కాదు. ధారూరులో నిజాం కాలం నుంచి పోలీస్‌స్టేషన్ కొనసాగుతూ వస్తుంది. పీఎస్‌ను తాండూర్–హైదరాబాద్ ప్రధాన రహదారి పక్కనే ఏర్పాటు చేశారు. కేసుల సంఖ్య పెరగడం, రోడ్డుపై ఏం జరుగుతున్నాక్షణాల్లో తెలుసుకునేందుకు ఇక్కడ ఏర్పాటు చేసిన వ్యవస్థతో సిబ్బందికి సులభమైంది. ఈ పీఎస్‌కు ఒకే ఎస్ఐ విధుల నిర్వహిస్తున్నారు.

ఎక్కువ కేసులతో ఇబ్బంది

ఎక్కువ కేసులతో ఒకే ఎస్ఐ ఉంటే సత్వర పరిష్కారం లభించదని భావించిన పోలీసు శాఖ 2014లో ఎస్ఐ–2 పోస్టును మంజూరు చేసింది. తొమ్మిది సంవత్సరాలు పాటు ధారూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ–2 పోస్టు కొనసాగగా 2023 నుంచి ఆ పోస్టును భర్తీ చేయకుండానే వ్యవస్థను నడిపిస్తున్నారు. దీంతో ఎస్ఐ–2 పోస్టు రద్దయిందనే పుకార్లు వ్యాపించాయి. 2014 నుంచి ధారూరు పీఎస్‌లో ఎస్ఐ–2 పోస్టు కొనసాగుతూ వచ్చింది. చివరగా 2022 జనవరిలో ఎస్ఐ–2గా రాధిక బాధ్యతలు చేపట్టి 2023లో బదిలీపై వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఇంతవరకు ఆ పోస్టును భర్తీ చేయలేదు. దీంతో ఆ పోస్టు రద్దయిందా అని ప్రజా ప్రతినిధులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మండలంలో శాంతి భద్రతలకు సంబంధించి ఉన్నతాధికారులు ఆలోచించి ఎస్ఐ–2 పోస్టును నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

దౌల్తాబాద్: మండలంలోని బాలంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి ఫీడర్ కింద ఉన్న గ్రామాలకు సబ్‌స్టేషన్‌లో మరమత్తులు, ట్రీకటింగ్ నిమిత్తం సోమవారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఏఈ మహిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలందరూ సహకరించాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి సహకరించండి

కొడంగల్: పట్టణ శివారులో నిర్మిస్తున్న శ్రీధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు విరాళాలు ఇచ్చి సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ రవీంద్రయాదవ్, కానుకుర్తి నర్సిరెడ్డి, పి.శ్రీనివాస్‌గౌడ్, ఉమాపతి కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. యాదాద్రి ఆలయ తరహాలో కొడంగల్‌లో అయ్యప్పస్వామి ఆలయాన్ని కృష్ణ శిలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. అయ్యప్పస్వామి, కుమారస్వామి, వినాయకుడి ఆలయాల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. ఈ పవిత్ర కార్యంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఆలయ నిర్మాణానికి విరాళాలు ఇస్తామని హామీ ఇచ్చిన భక్తులు తొందరగా ఇచ్చి సహకరించాలన్నారు.

ప్రతి ఒక్కరూ పొదుపు అలవర్చుకోవాలి

షాబాద్: ప్రతి ఒక్కరూ పొదుపును అలవరుచుకోవాలని వివేకానంద పరస్పర సహకార పొదుపు సంఘం అధ్యక్షుడు నర్సింహులు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంఎస్ గార్డెన్‌లో ఆయన అధ్యక్షతన 19వ వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం గడిచిన 19 సంవత్సరాల్లో దినదినాభివృద్ధి చెందుతూ, 802 మంది సభ్యులతో రెండున్నర కోట్ల టర్నోవర్ సాధించిందని తెలిపారు. కార్యక్రమంలో రామాంజనేయ మండల సమాఖ్య ముఖ్య సలహాదారు బాల్‌రాజ్, పాలక మండలి సభ్యులు మల్లికార్జున్, ప్రదీప్, రజినీకాంత్, హరీశ్, చంద్రయ్య, సత్యం, గౌరీశ్వర్, భాగ్యవతి, మల్లేశ్, రవీందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

శాశ్వత కార్యదర్శిని నియమించండి


పెద్దేముల్ గ్రామ పంచాయతీ కార్యాలయం

పెద్దేముల్: మేజర్ గ్రామ పంచాయతీ అయిన పెద్దేముల్‌కు శాశ్వత పంచాయతీ కార్యదర్శిని నియమించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. గతంలో ఇక్కడ పని చేసిన భాస్కర్ పరిగి మండలానికి బదిలీపై వెళ్లడంతో సుమారు ఆరు నెలల నుంచి ఇన్‌చార్జి కార్యదర్శులతో కాలం వెళ్లదీస్తున్నారు. వచ్చిన ఇన్‌చార్జి కార్యదర్శులకు సమస్యలపై అడిగితే సరైన సమాధానం ఇవ్వడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఫుల్ చార్జి ఇవ్వనిది పూర్తి బాధ్యతలు ఎలా తీసుకోవాలని ఇన్‌చార్జి కార్యదర్శులు ఎదురు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలోని పలు వార్డులు మురుగు కాల్వలు పారి దుర్గంధం వ్యాప్తిస్తోంది. కొన్ని వార్డులకు సక్రమంగా నీరు రావడం లేదు. వీధి లైట్లు 24 గంటలు వెలిగినా పట్టించుకునే నాథుడు లేరు. ముఖ్యంగా మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలి. అది ఎక్కడా అమలు కావడం లేదు. పనులు ఉన్నప్పుడు తప్పా మిగతా సమయంలో వారి జాడ లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పర్మినెంట్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) జయసుధకు ఇటీవల గ్రామస్తులు ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే తప్పకుండా పర్మినెంట్ కార్యదర్శిని నియామకం చేస్తామన్నారు.

సమాజ సేవతోనే గుర్తింపు

మొయినాబాద్‌రూరల్: సమాజంలో విద్యతో పాటు ఉద్యోగాలు చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించినప్పుడే గుర్తింపు వస్తుందని ఇంటర్నేషనల్ స్వామి నారాయణ గురుకుల్ పాఠశాల స్వామిజీ సుక్‌వల్లభ్ స్వామి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని స్వామి నారాయణ గురుకుల్ ఇంటర్నేషనల్ పాఠశాల, కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2014– 15లో పదో తరగతి విద్యార్థులు, 2016–17లో ఇంటర్మీడియట్ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుక్‌వల్లభ్ స్వామి జీ పాల్గొని ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో సేవా కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. ఇంటర్నేషనల్ స్వామి నారాయణ గురుకుల్ పాఠశాలలో పది సంవత్సరాల క్రితం ఎస్ఎస్‌సీ, ఇంట ర్ విద్యను అభ్యసించిన పలు రాష్ట్రాల విద్యార్థులు నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కృష్ణచరణ్‌దాస్, వివిధ రాష్ట్రాలకు చెందిన పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డున పడ్డ కుటుంబానికి చేయూత


ఆర్థికసాయం అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

పరిగి: మండల పరిధిలోని యాబాజిగూడ గ్రామానికి చెందిన కొమ్ము నారాయణ ఇల్లు ఇటీవల దగ్ధం కావడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. దీంతో పరిగి ఆర్యవైశ్య సంఘం స్పందించి ఆదివారం బాధిత కుటుంబానికి రూ.1.11 లక్షల నగదును అందజేశారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మధుసుదన్ మాట్లాడుతూ.. ఇల్లు దగ్ధమై కుటుంబం మొత్తం రోడ్డున పడిందని ఆర్థిక సాయం కోరడంతో సంఘ సభ్యుల దృష్టికి తీసుకెళ్లడంతో చందాలు వేసుకుని సాయాన్ని అందించామన్నారు. సంఘం ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు తాము ఎల్లప్పుడూ సహాయ సహకారాలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పూడూర్ జెడ్పీటీసీ మేఘమాల, సంఘం ప్రధాన కార్యదర్శి వేముల కిరణ్, కోశాధికారి మల్లేశం, మహిళా అధ్యక్షురాలు సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

మదిలో జ్ఞాపకాలు పదిలం


మోమిన్‌పేట: గురువు బీరయ్యను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మోమిన్‌పేట: వారందరూ కలుసుకోక సుమారు 25 సంవత్సరాలు కావస్తుంది. గతంలో కలిసి మెలిసి ఒకే చెట్టు నీడలో వారు చదువుకున్నారు. అనంతరం ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. తిరిగి తమ బాల్య స్మృతులను నెమరు వేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అందుకు మండలంలో మేకవనంపల్లి ఉన్నత పాఠశాల వేదికైంది. ఆ పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు చెప్పిన గురువులకు సన్మానాలు చేసి సంబరాలు చేసుకొన్నారు. అందరూ ఒకే వేదిక వద్దకు చేరుకొని తమ జ్ఞాపకాలను ముచ్చటించుకొని సంతోషంగా గడిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పరిగి: పట్టణ కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1974 నుంచి 2017 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు, ఆచార్యులు సమ్మేళనంలో పాల్గొన్నారు. పూర్వవిద్యార్థులను ఉద్దేశించి ఆచార్యులు మాట్లాడుతూ.. పాఠశాలలో చదివి ఉన్నత స్థానంలో ఉండి మంచి ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్న వారు పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం ఎంతో సంతోషించ దగ్గవిషయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు పార్థసారథి, పూర్వ విద్యార్థి పరిషత్ అధ్యక్షుడు ముకుందనాగేశ్వర్, జ్ఞానేశ్వర్, లింగం, సుధాకర్ పాల్గొన్నారు.


పరిగి: సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

వాన వచ్చి.. అతలాకుతలం చేసి


ధారూరు: మోమిన్‌ఖుర్దులో ఎగిరిపోయిన ఇంటి పైకప్పు రేకులు


ధారూరు: కుమ్మర్‌పల్లిలో పడిపోయిన ఆంజనేయస్వామి ఆలయ శిఖరం


బొంరాస్‌పేట: నాన్యానాయక్‌తండా వద్ద ఒరిగిన స్తంభాలకు తీగలు సరిచేస్తున్న సిబ్బంది

- ఈదురుగాలులకు విగిరిపడ్డ చెట్లు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- పలుచోట్ల ధ్వంసమైన ఇళ్లు
- నిలిపోయిన విద్యుత్ సరఫరా

బొంరాస్‌పేట: అకాలం వర్షం, బలమైన ఈదురు గాలులు అతలాకుతలం చేశాయి. ఆదివారం సాయంత్రం దుద్యాల మండలంలో ఈదురుగాలుల దుమారం రేపాయి. ప్రసిద్ధ పోలెపల్లి ఎల్లమ్మ దేవస్థానం వద్ద గాలులకు చెట్లు విరిగిపడ్డాయి. హకీంపేట, ఈర్లపల్లి సమీప గిరిజన తండాల్లో గాలులు బీభత్సం సృష్టించాయి. పోలెపల్లి, హకీంపేట, ఈర్లపల్లి, నాన్యానయక్‌తండా, చిల్మల్‌మైలారం, గౌరారం తదితర గిరిజన తండాల్లో ఈదురుగాలులు ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేశాయి. పలు చోట్ల ఇంటి పైకప్పులు లేచి పోయాయి. నాన్యానాయక్‌తండాలో విద్యుత్‌స్తంభాలు విరిగి పలువురి ఇళ్లపై పడ్డాయి. తండాకు చెందిన సోమ్‌నాథ్ ఇంటిపై పడి పైకప్పు పూర్తిగా దెబ్బతింది.

గాలివానకు ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

ధారూరు: గాలివానకు ఓ ఇంటి పైకప్పు లేచిపోయి అందులో ఉన్న సామగ్రి అంతా పాడైంది. నీటి నిల్వతో నిరాశ్రయులైన కుటుంబం చివరకు పాఠశాలలో తలదాచుకున్నారు. ఈ సంఘటన ధారూరు మండల పరిధిలోని మోమిన్‌ఖుర్దు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చాకలి నర్సింహులుకు చెందిన ఇంటి పైకప్పు రేకులు గాలి దుమారానికి లేచిపోయాయి. ఇంట్లోకి నీరు చేరి వస్తువులన్నీ పాడయ్యాయి. నర్సింహులు కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని గ్రామస్తులు కోరారు. కాగా కుమ్మర్‌పల్లి గ్రామంలో శ్రీఆంజనేయస్వామి ఆలయ శిఖిరం గాలిదుమారానికి కిందపడిపోయింది.


బొంరాస్‌పేట: ఈదురు గాలులకు ఎగిరిపోయిన ఇంటి పైకప్పు


బొంరాస్‌పేట: ఈర్లపల్లితండాలో చెట్లు విరిగి దెబ్బతిన్న ఇల్లు


బొంరాస్‌పేట: పోలెపల్లి ఎల్లమ్మ ఆలయంలో కిందపడిన ధ్వజస్తంభం శిఖరాగ్రం